


ఇది భక్తిజ్ఞాన కర్మయోగములఁ దెలుపు మాసపత్రిక.

ప్రతి హూణమాసారంభంబున వెలువడుచుండును.
విలేఖకుఁడు-ప్రకాశకుఁడు, వావిలికొలను-సుబ్బరావు,
(వాసుదాసుఁడు) ఒంటిమిట్ట.

"భక్తిరేవైనం గమయతి, భక్తి రేవైనం దర్శయతి
భక్తివశః పురుషః ॥" మా. శ్రుతి.
భక్తియే భగవంతుని బొందించును, ఆయనను దర్శింపఁజేయునది
భక్తియే, భగవంతుఁడు భక్తివశుఁడు.



| సంపుటము | 1934వ సంవత్సరము జనవరి నెల | సంచిక |
|---|---|---|
| 6 | శ్రీముఖనామ సం॥ పౌష్య మాసము. | 1 |



శ్రీరామానందలహరి

సీ. ప్రాకృతగుణములు రజము సత్త్వంబును, దమము నీయందెప్డు
దనరకుంట । నిర్గుణుండందురు నిగమాంతవేదులు, జగ
ముల సృష్టిరక్షణ సేఁత । సంహారమును లేనిసమయంబు
నందును, వ్యాపారహీనత వఱలుకతన । నిర్గుణుండందురు
నిన్నవి చేసెడి, యదనుల సగుణుండ వందురభవ

గీ. నీదశాభేదమును బట్టి నిర్గుణుండ
వగుచునుందువు సగుణుండ వగుదువయ్య
గుణములే లేవు నీ కనుకూఁత నీ వ
భావ మనుటకుఁ బర్యాయపదముగాదె.

## శ్రీరామ.
## స్వవిషయము.

శ్రీ సీతారాముల కరుణా కటాక్షవీక్షణమునను జందాదారుల యాదరణముచేతను భక్తిసంజీవని నైదు సంవత్సరములు యథాసుఖముగఁ గడచెను. చందాదారులందఱు నిట్టి యాదరణమునే నిఁకనుజూప నమస్కార పూర్వకముగఁ బ్రార్థింపఁబడుచున్నారు. భక్తిసంజీవని కృతజ్ఞత గలది, కావునఁ జందాదారులిచ్చు పైకమునకు సంజీవని సంచికలేకాక యనుబంధ పత్రికల నందించుచున్నది. దీనివలననే సంజీవని ధనార్థిని గాదనియు నష్టించి కష్టించియైనను బాఠక మహాశయులకు జ్ఞాతవ్యములను విన్న వించుటయె ముఖ్యముగాఁ దలఁచి యున్నదనియుఁ బాఠకమహాశయు లెఱుంగఁగలరు.

సంజీవని చెప్పెడి విషయములు శూన్యవాదులు నాస్తికులునగు శుష్క వేదాంతులకు నటువంటి వారికి ప్రారబ్ధవశమున రుచింపకుండిన నుండునుగాక, సంజీవని యసత్యము చెప్పినదని చెప్పెడినోళ్ళు వారికిని లేవనుట పాఠక మహాశయులే యెఱిఁగియున్నారు. గతసంవత్సరమున యోగవిద్యగుఱించి సంజీవని వ్రాయ నుపక్రమించునని తెలుపఁబడియుండెను. భక్తి ద్వేషులు నిష్కారణ కలహపరులునగు శుష్క వేదాంతులు గిచ్చి కలహమునకుఁ బిలుచుటచే వారి నోళ్ళు మూయించుట యావశ్యకమయ్యెను. వారు భక్తిపాలిటికి క్షుద్రశక్తులగుటచే వానికి నుచ్చాటనము చెప్పినఁగాని భక్తి కోలుగొనదని యేర్పడుటచే నాకార్యము ముందు చేయవలసివచ్చెను. ఆ గ్రహపీడ తొలఁగినది. వాస్తవాద్వైత వేదాంత మెట్టిదో దుష్టాద్వైత వేదాంత మెట్టిదో దాని నెవరుచెప్ప నెవరువిన నర్హులో యాశాస్త్రమునఁ జెప్పబడిన విధము చెప్పఁబడెను. ఇఁక వెఱ్ఱివేదాంత ములఁబడి దురభినివేశ పిశాచగ్రస్తులుగాక తక్కినవారు చెడిపోవఁగారణము లేదు.

శాస్త్ర చోదితములైన రీతిని వారివారి మతధర్మములు వారివారికిఁ దెలియక పోవుటచేతనే యజ్ఞానము బలమై దేశము చెడఁగారణమైనది. హిందువులు తప్ప నన్ని దేశములవారు మతజ్ఞానము నభివృద్ధి చేసికొను చున్నారు. ఈ యజ్ఞానమును సహాయముగాఁగొని కొందఱు దుర్మతముల వ్యాపింపఁ జేయుచున్నారు. కొండెములు చెప్పెడివారి నేమిచేయవలయు ననిన వినెడివారిచెవులు తెగఁగోయవలయునని సామెతకలదు. శాస్త్ర విహితరీతిని మతజ్ఞానము వ్యాపించియుండెనేని యిప్పుడు దేశమును గందరగోళముచేయు ననేక దుష్కార్యములకు నెడముండదు. శాస్త్రవిహిత మతజ్ఞానము లేకుండుట చేతనే యల్పజ్ఞులై తమ బుద్ధిబలమే ప్రమాణమని నేఁటి నాయకులు తదనుచరులు ననేకులు వక్రమార్గమునఁ బోవుచున్నారు. ఈయనర్థమున కంతయు భక్తిశూన్యతయే కారణము. దైవచింతనము లేక పౌరుషముచేతనే కార్యములు సాధింప నేఁటివారు కొందఱు చూచుచున్నారు. పౌరుషము ఫలించుటకు దైవసాహాయ్యము కావలయుననుట వారెఱుఁగరు. **“శక్యం ఖలు భవేద్రామ సహాయేన త్వయానఘ, సురరాజ్య మపిప్రాప్తుం స్వరాజ్యం కింపునః ప్రభో”**. నీవు సహాయుఁడవైతివేని స్వారాజ్యమైన సాధ్యమగును. స్వరాజ్యముమాటయేల యని సుగ్రీవుఁడు చెప్పినట్లు భక్తిచేత స్వరాజ్యమే కాదు స్వర్గము మోక్షమైన సాధింప వచ్చును. **“దైవమేవపరం మన్యే పౌరుషంతు నిరర్థక”** మ్మని కదా దుర్యోధనుఁడు కడపట నేడ్చెను. గాదెలోని కందిపప్పును దినమరగిన గాదెక్రింది పందికొక్కును నీవు తినకుండఁ బోదువా నేను బస్తులుందునా యనినంత మాత్రమున నదిపోదు. గండుపిల్లినో కుక్కనో సాకవలెను. బోనైనఁ బెట్టవలెను. కంపయైన నాటవలెను. పొగయైనఁ బెట్టవలెను. కొట్టరాదు. చెనకికఱపించు కొననురాదు. రాజనీతి శాస్త్రములందుఁ జెప్పఁబడిన యేడుపాయములలో నిప్పటివా రవలంబించునది యే యుపాయమో సంజీవని యెఱుఁగదు. ఉద్దేశ్యము మంచిదేకాని యుపాయము సరియైనది కాదు.

చదరంగ మాడునపుడు ఒక తప్పెత్తువేసిని నాటయంతయుఁ జెడినదే రెండుమూఁడు తప్పడుగులు వేసిన నా యాటకాఁ డేమిగెలువఁగలఁడు. సమర్థుఁడైన నాయకుఁడు రామచంద్రమూర్తి క్రోఁతులచేఁ దనకార్యము సాధించెను. అసమర్థుఁడైన దుర్యోధనుఁడు బీష్మాదుల వంటివారు సహాయపడినను జచ్చెను.

వీరిది సాపాయమేకాని సదుపాయముగాదు. మిత్రభావములేక విరుద్ధభావము గలిగి యశక్తతవలన వెలుపలఁదలలు పగులఁ గొట్టించుకొనుట గృహముల మాంసభక్షకు లగుట యితర దుష్కార్యములు చేయుట త్రికరణశుద్ధి లేకుండుట యహింసా వ్రతలక్షణము గాదు. దుర్యోధనుని రాజ్యమును విత్తుపాడు చేసినది భగవంతుని శరణుచొచ్చి గోవిందా యని యొక కేకవేసిన యొక యాఁడుది. రావణ రాజ్యమును ధ్వంసము చేసినది భగవత్పరతంత్రవ్రతయైన యాఁడుది, హిరణ్యకశిపు రాజ్యము నాశముచేసినవాఁడు బాలభక్తుఁడు, భగవంతునిచే బలిరాజ్యము నణఁగఁద్రొక్కించినది యొక యాఁడుది.

వీరివలె భక్తితో భగవంతుఁడు సేవింపఁబడునేని భక్తుల కోరికల నెఱవేర్ప భగవంతుఁడు తగిన పరికరముల సమకూర్చును. ఏనాఁడు సాధ్వులు, సాధువులు నిజమైన యార్తితోఁ గన్నీరు కార్తురో యానాఁటి నుండి శత్రుక్షయము ప్రారంభమగును. అంతవఱకు అక్కఱరాటమేకాని బావబ్రతుకుట లేదు. స్వరాజ్య మపేక్షితమైనను నీతిమాని మతములు వదలి యంతఃకలహములు వృద్ధిచేయుచు దేశమును భక్తి శూన్యముచేసి స్వధర్మము నాశముచేసి దానిని సంపాదింప యత్నించుట సరియైన పద్ధతిగాదు. సాధుబాధకమైన దుష్ట స్వరాజ్యమున కంటె నబాధకపరరాజ్యమే మేలు. దేహమునఁ బుట్టిన వ్యాధి కంటె నడవినిబుట్టిన మూలికలు సుఖరములు. భగవద్భక్తిగలిగి భారమాయనయందు వైచి నిమిత్త మాత్రముగఁ బురుషకారముచేసిననే యది దైవకృపచే ఫలించునుగాని యితరములైన కుట్రయుక్తులు ఫలవంతములు కాఁజాలవు. కావున సర్వార్థసాధకమైన భక్తిని సంజీవని బోధించుచున్నది. భక్తి వలననే సర్వభూత మైత్రి కలుగును. దానివలననే సదాచార సంపత్తి కలుగును. దానివలననే యోగ్యతా యోగ్యతలు జ్ఞానము కుదురును. దానివలననే యైకమత్యము లభించును, అప్పుడే పౌరుషము దైవము రెండును బనిచేయును. ఇష్టార్థము సిద్ధించును.

అయినను గలిబలముచే నిది యిప్పుడు విశేషము పని చేయదనియు సంజీవని యెఱుఁగును. ఇప్పుడు సప్తర్షులు మఖయందున్న వారు. ఇంకను గలి ముందు ప్రబలవలసియున్నది. అనేక ఘోరములు జరుగవలసియున్నవి. దుష్ట ప్రభుత్వము రావలసియున్నది. సాధువులు వారివారి యిండ్లలో వారువారుం డుటయుఁ గష్టముకాఁగలదు. ఎంత కలిముదిరి దేశమునందెన్ని యనర్థకములు ప్రబలినను గొందఱైన భక్తులు భక్తురాండ్రు ధర్మమార్గనిష్ఠ లుందురు గాని యుండకపోరు. వారే కృతయుగ ధర్మమునకు బీజభూతుల గుదురు. ఇట్లని విష్ణుపురాణము చెప్పుచున్నది. పరిశుద్ధ భక్తిగలవారందఱు నీలోపల ముక్తులుగా రేని యీ తెగలోఁజేరుదురు. ఆర్యులకు నేడు గూఢయాత్మవిద్య. పాశ్చాత్యులకు ననాత్మవిద్య. ఆత్మవిద్యచేతనేయనఁగా కర్మ, జ్ఞాన, భక్తి యోగములచేతనే మనము బాగుపడవలయును. మఱియొకవిధముగ బాగుపడఁజాలము. ఇట్లని వివేకానంద స్వాములవారు చెప్పుటేకాక దీర్ఘకాలమమెరికా యందుండి వచ్చిన జే. శి. ఛత్రజీపండితుఁ డిట్లు చెప్పెనని 5-12-33 హిందూపత్రిక ప్రకటించెను.

## India from the American stand point
## Madras Indeed.

"America was willing to know of India culturally. India was being approached in a sympathetic spirit by a great many who had realized that Christianity had failed them, that religious and moral life was undermined and that it was only the philosophy of India that was rational. The lecturer in conclusion said that their responsibility in spiritual life was great and that if they made spiritual life living, they would win back their place in the comity of nations."

అమెరికావారు హిందువుల చిత్తప్రబోధమునఁ జేయు కృషినిగుఱించి తెలిసికొనఁ గోరుచున్నారు క్రైస్తవ మతము వ్యర్థమనియు నది నీతిని మతమును నాశము చేసిననదనియు హిందువుల తత్త్వవిద్యయే జ్ఞానవంతమై న్యాయ్యమైనదనియు నిశ్చయించుకొనిన యనేకులు ఇండియా దేశము సుఖమే తమ సుఖము గాను దాని దుఃఖమే తమదుఃఖముగాను దలఁచి సమీపింపనున్నారు. ఉపన్యాసకుఁడు కడపట మతానుష్ఠాన మందు హిందువులయందు విశేషభారమున్నదనియు. అట్టి తత్త్వజ్ఞానము ననుష్ఠానముచే జీవించియుండు దానిగాఁ జేసిరేని మరల జాతిసముదాయములోఁ బూర్వమువలె నున్నతస్థితికి రాఁగలరనియుఁ జెప్పెను.

ఏనాఁటికైన హిందూ దేశము బాగుపడునేని యాత్మ విద్యావంతుల వలన బాగుపడునేకాని కామ దాసులవలన బాగుపడదనుట నిశ్చయము. అరవింద ఘోష్ గా రీయభిప్రాయము గలవారే.

అట్టి యభిప్రాయము గలవారికి మార్గదర్శినిగా నుండ వలయుననియే యథాశక్తి సంజీవనికృషి చేయుచున్నది.

**కలౌ కృతయుగంతస్య, కలిస్తస్య కృ తేయుగే**
**యస్యచేతసి గోవిందో హృదయే యస్యనాచ్యుతః ॥**

ఎవని మనస్సునందు భగవంతుఁడు లేఁడో వానికిఁ గృతయుగమే కలియుగము. ఎవనికిఁ గలఁడో వానికిఁ గలియుగమే కృతయుగము.

చెప్పవలసిన విషయములు చెప్పుటమాత్రమే సంజీవని వంతు. తక్కినది వారివారి ప్రారబ్ధానుసారము

జరుగఁగలదు. రావణుఁడు దుర్యోధనుఁడు చెడినది మంచిమార్గము చెప్పెడు వారు లేక కాదు. వారు మహాపార్శ్వాదులు కర్ణాదులు చెప్పినవి వినుటచేతను విభీషణ భీష్మాదులు చెప్పినవి వినకపోవుట చేతను జెడిరి. వర్షముగురియుట మేఘమువంతు, ఆచినుకులు ముత్తెపుఁ జిప్పలయందుఁబడెనా? వంటభూముల యందుఁ బడెనా? బండలమీఁదఁ బడెనా? యని విచారించుట దాని కార్యము గాదు. సంజీవనీ కార్య మిట్టిదియే. నైమిత్తికముగ నిది వ్రాయవలసి వచ్చెను. ఇఁక నీవిషయము సంజీవని యేమియు వ్రాయఁ జాలదు.

## శ్రీ రామానుజులవారు, కబీరుదాసు.

విష్ణువర్ధనుఁడను భూపతి శ్రీ రామానుజాచార్యుల వారికి భక్తుఁడును శిష్యుఁడునై యుండెను. ఆనరపాలునిచే నర్చితుఁడయి యాయతిరాజు భక్తగ్రామ పూర్ణాది సర్వశిష్య పరివృతుఁడయి యానృపతి పత్తనమునఁ గొంతకాలముండెను. ఇట్లుండ వారు శ్రీరంగమునుండి తెచ్చిన శ్వేతమృత్తు (తిరుమణి) వంతయు వ్యయమగుట దెలిసి వ్యాకులాత్ముఁడైయున్న యాయతి శిరోమణి స్వప్నమున శ్రీహరి ప్రపన్నుఁడై యాదవాద్రియందుఁ దిరుమణి కలదు. నేనును నందు వేంచేసియున్నాఁడను నాకు మందిరాదుల నిర్మింపు మని యానతిచ్చి యంతర్హి తుఁడయ్యెను. అంతట మేల్కాంచి కలలోఁగాంచిన విషయమును శిష్యులకుఁ దెలిపి యా విష్ణువర్ధనురావించి 'తనకు స్వప్నమున స్వామి సెలవిచ్చిన సమాచారమును, దాను యాదవాద్రికిఁ బయనించెదననియుఁజెప్పి సాహాయ్యముగ రమ్మని యా నృపతిని గోరెను.

ఆ విష్ణువర్ధనుఁడును గురుభక్తిధనుఁడగుట పరమ వినయమున **'స్వామీ! నేను నాది యనున దేదిగలదో'** యది యంతయు దేవరవారిదే 'సేవకుఁడు మీ ఆజ్ఞావశుఁడు' అని కావలసిన ధన జనయుతుఁడై సశిష్య భక్తజనుఁడగు యతి పుంగవునను గమించెను. వారరణ్యమును ఛేదించి మార్గము చేసికొనుచు నాయాదవాద్రిఁజేరి వేదపుష్కరిణిం దానమాడి పరిధాన శిలం దర్శించి యందందుఁ దదర్చామూర్తి నన్వేషింప మొదలిడిరి. ఎందును స్వామి కానరాఁడయ్యెను. అంతట శ్రీరామానుజాచార్యు లతిఖిన్నులై 'స్వామీ! నీ మహిమ మపారమే. నీవసత్య మాడినది లేదే– భక్తుని వంచించుట తగునా' యను కొనుచుఁ గనుమూసెను. అంతలో భగవానుఁడు ప్రపన్నుఁ డయి 'వత్సా' ఏల! నిర్విణ్ణుఁడ వయ్యెదవు. ఈ కొండకు దిగువ భాగమునఁ గల్యాణపుష్కరిణికి దక్షిణమునఁ జంపక వనమున కుత్తరమునఁ దొలసిచెట్టు కుదుటనున్న పుట్టలో నేనున్నాను. కల్యాణ సరోవరమునకుఁ గొ బేరదిశ నీ పర్వతమూలమున స్వచ్ఛమగు శ్వేతమృత్తుగలదు. దానిని బూర్వము గరుడుఁడు శ్వేతద్వీపమునుండి నాయాజ్ఞమైఁ గొనివచ్చి యిందు నిక్షేపించి యున్నాఁడు.' అని చెప్పెను. ఆ యతి సార్వభౌముఁడానందమున, నా వృత్తాంతము విష్ణువర్ధనాదుల కుఁ దెలిపి యా ప్రదేశమునకుఁ బోయి వల్మీకమును ద్రవ్వించి యందు శ్రీమన్నారాయణు నర్చాబింబమును దర్శించెను. ఆ మూర్తికి రామానుజుల వారు మూఁడు దినములు స్వయముగ క్షీరాభిషేక పూర్వక బహువిధ పూజలొనరించి విష్ణువర్ధన వసుమతీ కాంతునిచే నారమాకాంతునకుఁ బ్రాకార గోపుర మండప మంది రాదుల నేర్పాటు చేయించి శ్రీరంగరాజ భట్టరను వారిచేఁ బాంచరాత్రాగమోక్త విధానమున సంప్రోక్షణాది కములు గావించి యుత్సవములు చేయించు నుత్సాహము గలిగియు నుత్సవ బింబము లేమి చింతాదంతురి తాంతరంగుఁడైయున్న ఆయతిచంద్రమునకు శ్రీభగవానుఁడు తన ఉత్సవ బేరము రామప్రియాభి ధానమున నలరారునది డిల్లీశ్వరుని సదనమునఁ గలదని స్వప్నమున వా క్రుచ్చి పోయెను. అంతట సర్వ శిష్యసమూహము లు, గూడ నడువ విష్ణు వర్ధన ధరావరుని గూడుకొని డిల్లికిఁబోయి యా సార్వభౌమునిఁ గాంచి యతి సార్వభౌముఁడు తన వచ్చిన వృత్తాంతముందెలిపి 'రామ ప్రియుఁడను తమ దేవునిఁ దమ కిమ్మని యడిగెను.

అందుల కాతఁడు తాను దిగ్విజయమునఁ గొని తెచ్చిన శైవవైష్ణవ బింబములఁ జూప నందామూర్తి గాన రాదయ్యె. అంతట రామానుజుల వారా డిల్లీశ్వరునిఁ జూచి ఆ విగ్రహమిందుఁ గానరాలేదు. అంతఃపుర మున నున్నఁ దెప్పించి యీయుఁడని కోరెను. దానికా ప్రభువు నవ్వుచు 'రామప్రియుఁడు నిజముగ మీ దేవుఁడేయైన మీరు పిలిచిన నేలరాఁడు' అనెను. ఆ మాటలు విని యా భక్తాగ్రగణ్యుఁడు 'రాజనినది యథార్థమే. నిజముగా రామప్రియుఁడు నా దేవుఁడే యయ్యెనా పిలిచిన నేల రాకుండు'నని యను కొని లజ్జించి యేమియు ననక దుఃఖశోక సమావిష్టుఁడై మరల తన విడిదలకుఁబోయి పరుండెను. 'రామ ప్రియుఁడు కలలోఁ గానుపించి 'నే డిల్లీశ్వరుని పుత్రికచే నర్చితుఁడనై యామె శయ్యాగృహమున నున్నవాఁడ. నీ వచ్చుటకు వచ్చి తెచ్చికొనుమని చెప్పిపోయెను. ఈ స్వప్నమును దిల్లీశ్వరుఁ డెఱిఁగి యతివిస్మితుఁడై యతివర్యుని తనపుత్రికా శయ్యాగృహమునకుఁ గొంపోయెను. శ్రీ రామానుజాచార్యుల వారచటకేగి మిగుల

స్నేహపూర్వకముగాఁ 'చెల్లపిళ్ళా'యని పిలువఁగానే ఆ దేవుఁ డెల్ల రానందాశ్చర్యములఁ బెనఁగొన గునగున వచ్చి యాయన యొడిలో నిలిచెను. ఆ భగవద్భక్తుఁ డమందానందార్ణవ మగ్నుఁడును బులకాంకురిత దేహుఁడునై సంపత్కుమారా' యని పలుకుచు మాటికి మాటికిఁ గౌఁగిలించుకొనుచుండెను. అప్పటినుండియే రామప్రియునకు సంపత్పుత్రుఁ డను పేరువచ్చెను. డిల్లీశ్వరుఁడు రామానుజుని భక్తికిఁ బరమాశ్చర్యమును బొంది యాయనకు సాగిలిపడి మ్రొక్కి బహుమాన పురస్సరముగా నారామప్రియుని గొంపోవ ననుమతించెను. ఈ వార్త యాచక్రవర్తి సుత తెలిసికొని యా సతీమణి రామప్రియ విశ్లేష భీరువగుట పట్టరాని దుఃఖమున నడలుచుండుట తండ్రి తెలిసి యామెనుగూడ నా దేవునితోఁ దనకొమరునిచ్చి పంపుట కేర్పాటుచేసెను.

ఆ దిల్లీశసూనుఁడు 'ఆ రామప్రియునితోఁ దనదోఁ బుట్టువునొక శిబికయందెక్కించుకొని శ్రీ రామానుజులవారు వారి శిష్యులు విష్ణువర్ధన భూపాలుఁడు మున్నగు వారితోఁ గదలి యాదవాద్రికిఁ బయనించిరి. మధ్యేమార్గమున నా సాధ్వీమణి యాదేవునియం దైక్యమయ్యెను. ఇది గని యందఱును మిగుల నబ్బురపడిరి. యాదవాచలమును జేరినపిమ్మట నా నారీ తిలకరూపము నా రామప్రియపాద మధ్యమునఁ జెక్కించి యథావిధి సంప్రోక్షణాదులు గావించి బహువిధోత్సవములు జరపించుచు శ్రీరామానుజులవా రానందించుచుండిరి. ఈ సమాచారమును గుమారునివలన విని దిల్లీశ్వరుఁడు యాదవాద్రికివచ్చి కొన్ని వాసరములుండి కూఁతునందలి ప్రీతిపెంపున నవారిగ వివిధకై ంకర్యముల కమిత ధనము నొసంగెను.

ఈ విషయమును కబీరుదాసుఁడను బ్రఖ్యాత భగవద్భక్తుఁ డాకర్ణించి యాదవాద్రికిఁ జేరి యారామ ప్రియమూర్తి పాదమధ్యమున నర్చారూపిణిగానున్న డిల్లీశ్వరుని తనయం దిలకించి యానందించి శ్రీ రామానుజులవారిందర్శించి వారి యాజ్ఞగొని శ్రీరంగమునకేగి రంగనాథుని సేవించి యాదేవుని యనుగ్రహమును బొంది యాసర్వేశ్వరుని యాదేశమునఁ బురుషోత్తమ పావన క్షేత్రమునకుఁ జని యాజగన్నాథుని ప్రసాదమున ముక్తుఁడయ్యెను. నేఁటికిని నాభక్త కబీరుని ముక్తిస్థాన మాక్షేత్రమున విరాజిల్లుచున్నది.

కబీరుదాసుఁడు శ్రీ రామానుజులవారి కాలమున నుండినట్టు లీచరిత్రము దెలుపుచున్నది. భద్రాచల రామదాసు తరువాత తొమ్మిది శతాబ్దములకావల నుండిన రఘునాథ భట్టరాచార్యుల కంజలెత్తి'నాఁడు. అట్టి రామదాసున కీ కబీరు మంత్రోపదేశ గురువను టుస్మత్త ప్రలాపమేకదా. ఈ విషయము నొకప్పుడు సంజీవని తెలుపఁగా నొకానొక 'రా కబీరు కాకపోయిన నాతని వంశమువారిలో నాపేరు గలిగిన మతియొక రయి యుందు'రని యొక నిరాధారమయిన సమాధానము దెలిపి యున్నారు. మేము వ్రాసిన పై చరిత్రమునకు నాధారము కోరెడివారు ప్రపన్నామృతమను సంస్కృత గ్రంథమున 42-48 యధ్యాయములు చూడఁ బ్రార్థితులు.

రామానుజులవారి కాలము (క్రీ. శ. 1017-1137) లు అని చరిత్రకారులు వ్రాసియున్నారు. యాదవాద్రికే తిరునారాయణపుర మనియు- మేలుకోట యనియుఁ బేర్లుగలదు. ఇది మహిశూర రాజ్యమున నున్నది. రామదాసు రెండువందల సంవత్సరమునాఁటి వాఁడు.

## భక్తి విజయ పీఠిక.

(గతసంచికా శేషము 609వ పుట చూడు.)

జ్ఞానమార్గమందుఁ బ్రవేశించిన వారు సమస్తకర్మములు వదలవలయును సన్న్యాసికే కర్మములు లేవనికదా మాయావాదుల వాదము. వీరేమి చెప్పెదరో చూడుఁడు.

### కర్మకాండ సారము.

3 **తత్రకామ్యం పరిత్యజ్య సర్వథామోక్ష కాంక్షిభిః**
**నైమిత్తికంతు కర్తవ్యం, జీవమ్మ క్తేన యోగినా**

మోక్షమందుఁ గోరికగలవా రన్ని కామ్యకర్మము వదలవలయును. జీవన్ముక్తుఁ డైనను యోగియైనను నైమిత్తికములు చేయవలెను.

4 **అపి లోకోపకారాయ, స్వోపకారాయ నిత్యకమ్**
**అగ్ని హెూత్రాది నిత్యం స్యాత్కా ర్యం స్వాశ్రమసిద్ధయే.**

లోకోపకారము కొఱకుఁగాని తనయుపకారము కొఱకుఁగాని నిత్యములగు నగ్నిహెూత్రాది నిత్య కర్మములు స్వాశ్రమసిద్ధికై చేయవలయును.

5 **అత్యాశ్రమిత్వా సంసిద్ధ్యై జీవన్ము క్తస్య యావతా**
**విదేహముక్తి ర్నప్రాప్తా, తావన్నిత్యం సమాచరేత్**

అత్యాశ్రమిగాక జీవన్ముక్తుఁడై యుండి విదేహముక్తి (మరణము) ప్రాప్తించువఱకు నిత్యకర్మములు చేయవలయును.

**15 నిత్యకర్మవిహీనస్య, నాశ్రమిత్వం కదాచన**
**నచాశ్రమ విహీనస్య, ముక్తివార్తాపి యుజ్యతే.**

నిత్యకర్మములు చేయనివాఁ డేయాశ్రమమందున్నవాఁ డును గాఁడు. ఆశ్రమ విహీనునికి మోక్షమను మాటయులేదు.

**17 సంత్యజ్య స్వాశమాచారం, యత్రకుత్రాపి యేనరః**
**ప్రవర్తంతే స్వయంమోహా, త్తేహి పాషండినో జనాః.**

తమ యాశ్రమాచారముల వదలి యజ్ఞానులై యిష్టము వచ్చునట్లు వర్తించువారే పాషండులు.

**20 సమాధి ర్నాశ్రమా ద్వినా ॥**
**జీవన్ముక్తోపి పురుషః । స్వాశమాచార పూర్వకం**
**విదేహముక్తి సిద్ధ్యర్థ సమాధిం నిత్యమాచరేత్.**

ఆశ్రమములేక సమాధిలేదు. జీవన్ముక్తుఁడైనను విదేహముక్తి సిద్ధించుకొఱకుఁ దనయాశ్రమ ధర్మములఁ బాటించుచు నిత్యము సమాధియం దుండవలెను. సమాధియన గోరికాదు.

**21 బ్రహ్మచారీ గృహీ వానప్రస్థ స్సన్న్యాస్యపి స్వయమ్**
**దేహవిస్మృతి పర్యంతం, స్వకర్మ నిరతో భవేత్.**

బ్రహ్మచారిగాని గృహస్థుఁడుగాని వానప్రస్థుఁడు గాని సన్న్యాసిగాని దేహమును మఱచిపోవువఱకు కర్మములు చేయుటయందు నాసక్తిగలవాఁడై యుండవలెను.

**22 యాని నిష్కామకర్మాణి శ్రుతిస్మృత్యుదితానిచ**
**తేషామ త్రాననుష్ఠానే, సర్వేస్స్యుః ప్రత్యవాయినః**

శ్రుతులందు స్మృతులందు నిష్కామ కర్మములని యేని చెప్పఁబడినవో యవి యనుష్ఠింపనివారు పాపాత్ములు.

**23 జీవన్ము క్తస్య వైదేహ్యం ముక్తావిచ్ఛా వివర్జనే**
**పునర్జన్మాద్యభావేన నఫలం కర్మణేతిన.**

నేను జీవన్ముక్తుఁడ నైతిని, నాకే కోరికలు లేవు, పునర్జన్మాదులు లేవు. నే నేల కర్మములు చేయవలె ననరాదు.

ఈ విషయమై కేవల శాంకరాద్వైతి వైద్యనాథ దీక్షితు లేమి చెప్పుచున్నారో చూడుఁడు.

**"భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః, ప్రాణినాం బుద్ధిజీవినః ।**
**బుద్ధిమత్సునరాశ్శ్రేష్ఠాః, న రేషు బ్రాహ్మణా స్మృతాః ।**
**బ్రాహ్మణేషుచ విద్వాంసో విద్వత్సుకృత బుద్ధయః ।**
**కృతిబుద్ధిషు కర్తారః । కర్తృషు బ్రహ్మవేదినః ॥**

అను మనుస్మృతి శ్లోకమునకు టీక వ్రాయుచు–

విద్వాంసోవేద విదః । కృతబుద్ధయః పరిచిత వేదార్థాః । కర్తారశ్చోదిత కర్మకృతః । బ్రవేదినః పరమాత్మవేదినః । కర్తృషు బ్రహ్మవేదిన ఇతి వదతా బ్రహ్మవిద్భిరపి కర్మకర్తవ్య మితిసూచితం భవతి యని తమయభిప్రాయము వ్రాసిరి. దీనివలన బ్రహ్మజ్ఞానికైనను కర్మము త్యాజ్యముగాదు. కర్తవ్యము కర్మము త్యాజ్యమని చెప్పువారే కాని విడిచిన యద్వైతి యెవ్వఁ డును లేఁడు.

ఇట్టి వాక్యములు గ్రంథమునందు మఱియుఁ గొన్ని గలవు. మచ్చునకై కొన్ని చూపఁబడినవి. మీఁదఁ జెప్పఁ బడినవన్నియు సంజీవనికి సమ్మతములే. కావున వివేకముగల వారు తమక్షేమమునకై తాఁకు తప్పులెఱిఁగి ప్రవర్తింతురుగాక. మాయావాదుల యద్వైతమునందున్నట్టు దీనియందు శూన్యమత వాసన లేదు.

**(సశేషము.)**

## శ్రీ రాధాకృష్ణ సంవాదము.

(గతసంచికాశేషము 587వ పుట చూడు.)

**రాధ :-** (తన మనస్సులో) కృష్ణుఁడు నేఁడు నామానముగాపాడినాఁడు యశోద యిక్కడ నున్నప్పుడు అమ్మాయని యఱచియుండెనా..... (అనుకొనుచు గది యొద్దకుఁ బోయి) కృష్ణా!

**కృ :-** ఓ

రా :- కృష్ణ కృష్ణా

కృ :- ఓ ఓ

రా :- కృష్ణా కృష్ణా కృష్ణా

కృ :- ఓ ఓ ఓ.

రా :- ఉన్నావా?

కృ :- ఉన్నాను. ఉండక యేమిచేయుదును.

రా :- (తలుపుతెఱచి) కృష్ణా మీయమ్మ వచ్చియుండెనే

కృ :- అవును విన్నాను.

రా :- ఏల నీవు అమ్మా? యని పిలువలేదు.

కృ :- నీ బవిసి యాఱిపోదా.

రా :- కృష్ణా నిజము నిజముగ నేఁడు నామానము కాపాడితివి

కృ :- నీమానమేకాదు నాయందుఁబ్రేమగల యేస్త్రీ మానమైనఁ గాపాడుదును. కృష్ణాయని పిలిచినఁ జాలును.

రా :- నీవు నిజమైనమగవాఁడవు. ఆఁడుకుయిలు ఆలకుయిలు విని యూరకుండు మగవానికంటె నాఁడుదియే మేలు. నాకీయుపకారము చేసితివే నీకు బదులేమియిత్తును.

కృ :- ఒక్కముద్దు.

రా :- ఉండు ముందుము, ఎవరైనవచ్చిన నాసిగ్గు పోవును. వాకిటితలుపు లోగడియ వేసివచ్చెద (అని పోయి వీధి నీ వంక నా వంకఁ బాఱఁజూచుచు. యశోద కృష్ణునిఁ బట్టుకొని యేడ్చుచున్న యొక గొల్లపెల్లతో గొల్లపిల్లల గుంపుతో వచ్చుచుండెను.) యశోదమ్మా కృష్ణుఁడు దొరకినాఁడా?

య :- నాకు దొరకక యెన్ని కాళ్ళఁ బోఁగలఁడే వేయికాళ్ళున్నవా యేమి.

రా :- ఏల యాపిల్ల యేడ్చుచున్నది. వీరందఱు నవ్వుచున్నారేల?

య :- విచారించుట కే తీసికొని పోవుచున్నాను.

రా :- అడుగుము చూతము. మీకృష్ణుఁ డేమి కొంటెపని చేసెనో?

కృ :- నేను గొంటెనుగాను, తుంటరిగాను, నేనేమి యాఁడు దాననా చేయరాని పనిచేయుటకు.

య :- మాతంఁడ్రీ! నీవు గుణాలకుప్పవు, నే నెఱుఁగుదును గాని యీ పిల్ల యేల యేడుచుచున్నది.

కృ :- దానినే యడుగుము. నన్నడిగిన........

య :- అమ్మా ! ఏల యేడుచుచున్నావే?

గొల్లపిల్ల :- (ఏడుచుచుఁ గన్నులు పులుముకొనుచు) మీ మీ మీ కృ కృ కృష్ణుఁడు నా నా నా పండ్లన్ని తీ తీ తీసికొన్నాఁడు. (అని బాయని యేడ్చును).

య :- ఏమిరా కృష్ణా యేల దాని పండ్లు తీసికొన్నావు.

కృ :- (గొల్లపిల్లను వెక్కరించుచు) అమ్మమ్మమ్మా నేనే నేను ఈ పీ పీ పీ పిల్ల.......

య :- ఛీ సరిగాఁ జెప్పుము ఏమది నీకు నత్తికూడనా.

కృ :- పూజకుఁ బూలనిమిత్తమై పూలతోటకు దిన దినము పోవునట్లు నేఁడును బోవుచుంటిని. ఈ పిల్ల మనతోఁపులో నేరేడుపండ్లు పెద్దమూఁటగట్టి దానితోడ దిగలేక మూట క్రింద జాఱవిడిచి చట్టుదిగి వచ్చుచుండెను. ఇంతలో నేను బోయి యా మూట నెత్తికొని యా పండ్లన్నిటిని బిల్లల కందఱకుఁ బంచిపెట్టితిని.

య :- అట్లేల చేసితివి.

కృ :- పండ్లు మనతోఁపులోనివి, అవి యెవ్వఁడు నాటెనో, యెవతే నీళ్ళుపోసి పెంచెనో, ఇది

నాట లేదు. పెంపలేదు. అట్లుండ నా పండ్లలోనొకటియైన నాకియ్యరాదా! నాకీయకుండిన నిందఱు పిల్లలున్నారే వీరి కియ్యరాదా, అన్ని తానే తినవలెనా? సొత్తువారికిఁ గొంచెమైన పెట్టక తానే తినుట దొంగతనముగాదా.

య :- నీవు తినలేదా.

కృ :- అబ్బెబ్బే, యీపాపి తనది యనుకొన్నది ఆ యుచ్ఛిష్టము నా కేల? నాకుఁ బండ్లిచ్చువారు లేరా? నానోరు చూడుము. నేరేడుపండ్లు తిన్ననోరేమో? (అని నోరు తెఱచి చూపును.)

య :- అవునే రాధా యిది నేరేడుపండ్లు తిన్ననోరా, మా బిడ్డ యొకరిసొమ్మాశింపఁడమ్మా.

కృ :- అమ్మా! యొక్క మాటచెప్పెదను, నేను నీ బిడ్డనగుదునా కానా? నన్ను నీవు పోషించుచు నద్దుముద్దు చూచి యానందించు చున్నావా లేదా? ఇట్టి నీవు నాబిడ్డను నేనే ముద్దులాడవలె. మఱియెవరు మాకృష్ణునిఁ డాఁకరాదనుచున్నావా?

య :- లేదు.

కృ :- ఏల లేదు.

య :- నే నొకరి యానందమునకు సంతోషమునకు భంగమేల కల్పింపవలె నలువురితో పాటు నేను సంతోషింపవలె, నీకుఁగాఁజేయు పనియేమో చేయవలె, అసూయపడరాదు.

కృ :- కదా, సొత్తుగలదానవు నీవే యిటు తలంచుచుండ, మాట సామెతకుఁ జెప్పెదను. ఈ రాధ నన్నెత్తి ముద్దుపెట్టుకొని వేడుకగా నాతో నాడుకొన్నదనుకో, ఇది ముద్దు పెట్టుకొని వేడుకగా నాతో నాడుకొన్నదనుకో, ఇది యాప్రకారమే యితరులు జేసిన నసూయపడ వచ్చునా?

య :- కూడదు. ఎవరిసంతోషము వారిది.

కృ :- అట్లుండ నీపిల్ల తేరకుఁ దనకు వచ్చినదానిని సొత్తుగల వానికి నాకుఁబెట్టక యెవరికిఁ బెట్టక తానేతినవచ్చునా?

య :- కూడదు. అట్టివారికి బుద్ధివచ్చునట్లు చేయుటేసరి.

కృ :- ఎవరి విషయమందైన నేను జేయునది యంతేఅమ్మా!

య :- ఓసిపిల్లా! యిఁకమీఁద నీవట్లుచేయకు. తప్పు, అసూయ పనికిరాదు. నీ సంతోషమువంటి దే యితరుల సంతోషము. భోగ్యవస్తువు కావున నలువురు నాశింతురు. నేనొకతెనే యను భవింపవలె ననుమాట యేటిమాట, అవునా కాదా రాధా!

రా :- నీవు చెప్పినది న్యాయ్యమే, అమ్మా.

య :- ఇఁక నందఱు నెక్కడివా రక్కడఁ బొండు. కృష్ణా మన మింటికిఁ బోదమురా.

రా :- యశోదమ్మా! కృష్ణునికి నింతవెన్నపెట్టి నేను బిలుచుకొనివచ్చి విడిపించెదను.

య :- తెప్పపాటేమఱితివా వీఁడు నీకుఁ జిక్కఁడు. జాగ్రత్త. వేయికన్నులతో వేయి మనస్సులతోఁ గని పెట్టియుండిననే మనసొత్తు. నీవు పిలుచుకొనివచ్చి విడిపించెదవు కదా. మధ్యాహ్నము భోజనము వేళయయినది. వాని నాయన వచ్చి యడుగును. కనఁబడకపోయెనా; కృష్ణుఁడు నీకుఁగాఁబట్టలేదులే, మేము మగవారము. బయట చేను చెట్టు చూచిరావలసినది నాకుఁ బని. నీకు వేఱేపనిలేదే ఇంత మాత్రమొక్కనిఁగని పెట్టియుండలేవా, యనికోపించును.

రా :- లేదమ్మా పదినిమిషములలో నేనుదెచ్చి విడిపించెదను.

య :- అటయినఁ బిలుచుకొనిపొమ్ము.

రా :- కృష్ణా! మనయింటికిఁబోదమురా. (తనలో) గొల్లపిల్లవలన నేను గుణపాఠము నేర్చుకొంటిని. దానియందున్న చెడుగుణము నాయందున్నది. కృష్ణుఁడు నాకెట్టి వాఁడో అందఱ కట్టివాఁ డేకదా, వాఁడు మఱియొక గొల్లదానియింటికిఁ బోవును. అట్లు పోరాదు. అనికదా నేను వానిని గదిలోవేసివచ్చితిని, ఇది తప్పు, నావంటివారే తక్కినవారు కన్నులు తెఱచికొంటిని.

అది సరేకాని గదిలోని యిచ్చకాలమారి కృష్ణుఁడెవఁడు. ఈ రచ్చలమారి కృష్ణుఁడెవఁడు. పరీక్ష చేయవలె. ఇరువురు నొకరా, వేఱువేఱా. (అని యనుకొనుచుఁ గృష్ణుని రెట్టఁబట్టుకొని యింటిలోనికిఁ బిలుచుకొనిపోయి వీధివాకిలి గడియవేసి లోపలికిఁబోయి) కృష్ణా నీవిందుఁగూర్చుండుము. నేను వెన్న దెచ్చెదను. (అని గదిలోపలికిఁబోవును అక్కడఁ గృష్ణుఁడు లేఁడు). సరే వాఁడే తప్పించుకొని పోయినాఁడు.

(అని మరల రచ్చలకృష్ణునియొద్దకు వచ్చును ఆకృష్ణుఁడులేఁడు మరల గదిలోనికిఁ బోవును. మరల వచ్చును.) కృష్ణా కృష్ణా (అని యిల్లు నలుమూలలఁ జూచుచు. వేసినగడియలు వేసినట్లే యున్నవి. కృష్ణుఁడులేఁడు. రాధగుండెలలో రాయిపడినది యశోద కేమిచెప్పుదునా యని భయపడెను) నలువురు చూచుచుండఁగాఁ దోడితెచ్చితిని. ఇప్పుడు లేఁడనిన లోకులేమందురు. నమ్ముదురా! ఎక్కడనని వెదకుదును. ఎప్పుడు నూరిమీఁదఁ బోయినదానఁగానే, ఇప్పు డేమని పోదును. ఎక్కడకని పోదును.

**(సశేషము.)**

**ప్రపన్నామృతము.**

(గతసంచికాశేషము 583వ పుట చూడు.)

**అర్థపంచకము.**

ప్రాప్యమగు భగవంతు నుద్దేశించి భక్తులు ప్రపన్నులిట్లనుసంధానము చేయవలెను.

1. కేవల భగవన్మూర్తిమాత్ర మనుసంధింపరాదు. శ్రీవైకుంఠేతు పరేలోకే, శ్రియాసార్థం జగత్పతిః" "ఏషనారాయణ శ్రీమాన్ " శ్రీమాన్ చక్రాయుధోవిభుః" శ్రీవత్సవక్షా నిత్యశ్రీ "విష్ణో శ్రీ రనపాయినీ" సీతాసమక్షం కాకుత్థ్స మిదంవచన మబ్రవీత్ "సీతా మువాచాతి యశారాఘవంచ మహావ్రతం" అలమేషా పరిత్రాతుం రాఘవాద్రాక్షసీగణః" "తయా సహాసీన మనంతభోగిని' ఇత్యాద్యనేక స్థలంబులఁ జెప్పఁబడినట్లు లక్ష్మీ విశిష్టునిగానే ధ్యానింపవలెను.

2. "సమస్తహేయరహితం విష్ణ్వాఖ్యం పరమంపదం" పరః పరాణాం సకలాన యత్ర క్లేశాదయ స్సంతి పరావరేశే" హేయగుణములు లేనివాఁడును విష్ణువనఁబడు భగవంతునకు యెవ్విధములైన దోషములు లేవు. అనియుండుటవలన హేయగుణములేవియు కొంచెమైన లేనివానిఁగా ధ్యానింపవలెను.

3. తైర్యుక్త శ్శ్రూయతాంనరః" "తమేవం గుణసంపన్న మప్రధృష్య పరాక్రమమ్" జ్యేష్ఠం శ్రేష్ఠ గుణైర్యుక్తం" "ఏవం శ్రేష్ఠ గుణైర్యుక్తం" గుణైర్విరురుచేరామః" "బహవోతవ కల్యాణ గుణాః పుత్రస్య సంతితే, అనృశంస్య మనుక్రోశశ్శ్రుతం శీలం దమశ్శమః, రాఘవంశోభ యంత్యేతే షడ్గుణాః పురుషోత్తమమ్. నీ కొడుకు శ్రీ రామునందనేక కల్యాణ గుణములు గలవు. ఆనృంశ్యస్యము, అనుక్రోశము, శీలము, శ్రుతము, శమము, దమము ఈ యాఱుగుణములు శ్రీ రాముని ప్రకాశింపఁ జేయుచున్నవి. "విదితస్సహి ధర్మజ్ఞ శ్శరణాగత వత్సలః అప్పురుషోత్తముండు ధర్మాంకుఁడు నిన్ను నేలు శరణాగత వత్సలుఁడౌట నర్మిలిన్" శరణ్యం శరణంచ త్వామాహుర్దివ్యా మహర్షయః.

నిన్ను దేవతలు మహర్షులు శరణ్యుఁడవని శరణమని యెఱుఁ గుదురు. "నివాసవృక్ష స్సాధూనాం" భక్తులకు నిలువ వృక్షము; "తేజోబలైశ్వర్య మహావబోధ సువీర్యశక్త్యాది గుణైక రాశిః తేజము, బలము, ఐశ్వర్యము, జ్ఞానము, వీర్యము, శక్తి మొదలయిన గుణములకు ముఖ్యరాశి; సర్వభూతాత్మ భూతస్య విష్ణోః కోవేదితుం గుణాన్, యథారత్నాని జలదేః, అసంఖ్యేయాని పుత్రక। తథాగుణాశ్చ దేవస్య త్వసం ఖ్యేయాహి చక్రిణః। వర్షాయుతైర్యస్య గుణా నశక్యా వక్తుం సమేతైరపి సర్వదేవైః। చతుర్ముఖాయు ర్యది కోటివక్త్రో। భవేన్నరః క్వాపి విశుద్ధచేతాః। సతేగుణానా మయుతైక మంశం వదేన్న వాదేవవర ప్రసిద్ధ" సర్వభూతములకు నాత్మయగు విష్ణుగుణము లెవ్వఁ డెఱుఁగును. సముద్రము నందలి రత్నముల నెట్లు లెక్కింప నసాధ్యమో యట్టులే విష్ణుగుణము లసంఖ్యేయములు. దేవతలందఱు గలసి పదివేల సంవత్సరములు లెక్కించినను సాధ్యముకాదు. కోటి నోళ్ళు బ్రహ్మాయుస్సుగల విశుద్ధమనస్కుఁ డైనను ఆ నీగుణములలో పదివేలవభాగము లెక్కింపలేఁడు.

**తవానంతగుణస్యాపి షడేవప్రథమే గుణాః**

**యైస్త్వ యైన జగత్కుక్షా వన్యే ప్యంతర్ని వేశితా.**

నీ గుణము లనంతములయినను ముఖ్యము లయినవి ఆఱు. జగత్కర్తవగు నీయందు నితర గుణము లెన్నియోగలవు. "ఇషుక్షయా న్నివర్తంతే నాంతరిక్ష క్షిత క్షయాత్। మతిక్షయాన్ని వర్తంతే నగోవింద గుణక్షయాత్" ప్రయోగింపఁబడిన బాణము మరలుట ఆకాశము క్షయించి లేకపోవుటచేఁగాదు. అట్టులే మతిబలము తక్కువగుటచే మనస్సు వాక్కు నిలిచిపోవుచున్నవి కాని చెప్పుటకుఁ దలఁచుటకు గోవిందునందు గుణములులేక కాదు.

అని యిట్టి ప్రమాణము లనేకము లుండుట వలనఁ బ్రాప్యంబగుటకుఁ బ్రాపకంబగుటకు నుపయోగింపఁ దగు కల్యాణగుణములతోఁ గూడిన వానిఁగా ధ్యానింపవలెను.

ప్రమాణము లిట్లుండ భగవంతుఁడు సర్వగుణహీనుఁ డనుట మతిహీనతచేతనే కదా.
మఱియు "సదైకరూపరూపాయ" ఎల్లప్పుడు నొకవిధమైన రూపముగలవాఁడు. "సమస్తాశ్శక్తయ శ్చైతా నృపయత్ర ప్రతిష్ఠితాః । తద్విశ్వరూప వైరూప్యం రూప మన్యద్ధరేర్మహత్" ఎవనియం దీ సమస్త శక్తులు గలవో యతనికి నీ విశ్వరూపముకంటె వైరూప్యంబగు రూపమొకటి వేఱుగనున్నది. ఇచ్ఛాగృహీతా భిమతోరుదేహః' 'తన యిష్టప్రకారము తనకభీష్టమైన దేహము ధరించువాఁడు. "నభూత సంఘసంస్థానో దేహోస్య పరమాత్మనః । నతస్యప్రాకృతా మూర్తిః । మాంసమేదోస్థి సంభవా"
పరమాత్మదేహము పృథివ్యాది భూతముల చేరిక చేసైనదికాదు. ఆయన మూర్తి కాదు. "భుజై శ్చతుర్భిస్సము పేత మేత ద్రూపం విశిష్టం దివి సంస్థితంచ"
నాలుగు భుజములతోఁ గూడిన యీ రూపము పరమాకాశమం దుండునది. "రుక్మాభం స్వప్న ధీగమ్యం" బంగారుతో సమానమై స్వప్న బుద్ధిచే పొందఁదగినది. "తత్రైక స్థం జగత్కృత్స్నం పశ్యామి దేవాం స్తవ దేవదేహే. సమస్త ప్రపంచము దేవతలను నీ దేహమందుఁ జూచుచున్నాను. అస్త్రభూషణ సంస్థాన స్వరూపమ్" అస్త్రములు భూషణములు ధరించినరూపము" భూషణాస్త్ర స్వరూపస్థం యథైవ మఖిలం జగత్" తమసః పరమోధాతా శంఖచక్ర గదాధరః, ఈ ప్రపంచమంతయు నెట్టులో యట్టులే భూషణములయి నస్త్రములయి స్వరూపముగ నుండువానిని తమస్సునకుఁ బరముఁడై శంఖచక్ర గదాధరుఁడైన ధాత యన్నట్లు సమస్త ప్రపంచమున కాధారమై యప్రాకృత శుద్ధ సత్త్వ మయ దివ్య మంగళ విగ్రహముతో గూడినవానిఁగా ధ్యానింపవలెను.
"విష్ణోరేవ తా విభూతయః" ఇవన్నియు విష్ణువిభూతులు. "నాంతోస్తి మమ దివ్యానాం విభూతీనాం పరంతప" నా దివ్యవిభూతులకు నంతములేదు అన్నట్టు లనంత విభూతులు గలవానిఁగా ధ్యానింపవలెను.
చేతనములు అచేతనములునను రెండువిధములగు పదార్థములు భగవంతునకుఁ గ్రీడార్థములు భోగార్థములువై విభజింపఁబడియున్నవి ॥ సుఖమిచ్చుటయందు క్రీడ భోగము రెండును సమానములేయైనను రుచి భేదమును బట్టికొన్ని క్రీడకని కొన్ని భోగమునకని విభజింపఁబడినవి, నిత్యవిభూతి భోగార్థము. లీలావిభూతి ఈ ప్రపంచము క్రీడార్థము. "జన్మాద్యస్యయతః" జన్మాదు లెవనివలనఁ గలుగునో క్రీడాహరేరిదం సర్వం హరికి నిదంతయుఁ గ్రీడ. 'క్రీడతో బాలకస్యేవ' బాలకున కాటయైనట్లు, 'బాలః క్రీడనకైరివ' బాలుఁడు ఆటవస్తువులతో నాడుకొనునట్లు, "హరే విహరసి క్రీడా కందుకైరివ జంతుభిః" హరీజంతువులతోఁ జెండుతో నాడినట్టు లాడెదవు. "లోకవత్తు లీలా కైవల్యమ్" లీలా కైవల్యము లోకమునందువలెనే క్రీడార్థం దేవ దేవస్య విష్ణోర్లీలాధికారిణః, లీలాధికారియగు విష్ణు వాడుకొనుటకు (పాద్మ) అన్నట్లు.
క్రీడార్థము జగమును సృజించువానిఁగాను ధ్యానింపవలెను.
బ్రహ్మప్రాప్తికోరు జీవుఁడు ఆయనను లక్ష్మితోఁ గూడిన వానిఁగను, జ్ఞానానందాది కల్యాణ గుణము లపరిమితముగఁ గలవానిఁగను హేయగుణములు లేనివానిఁగను జ్ఞానము శక్తిలోనగు ననేక శక్తులుగలవానిఁ గను నుభయవిభూతి నాయకునిఁగను క్రీడార్థము జగత్సృష్ట్యాదులు గావించువానిఁగను ధ్యానింపవలెను.

### (3) పురుషార్థ స్వరూపము.

పురుషార్థమనఁగా బురుషునిచేఁ గోరఁబడునది. అట్టి పురుషార్థ మైదువిధములు. 1. ధర్మము, 2. అర్థము, 3. కామము, 4. ఆత్మానుభవము, 5. భగవత్ప్రాప్తి.
ఇందు,

**1. ధర్మమనఁగా :-**

**ధారణాద్ధర్మ మిత్యాహుః । ధర్మోధార యతేప్రజాః**
**యత్స్యాద్ధారణసంయుక్త । సధర్మఇతి నిశ్చయః. మ. భార. కర్ణ. 69-59.**

ధరించునది గావున ధర్మమనఁబడును. ప్రజలు ధర్మముచే ధరింపఁబడుచున్నారు. ఏది ధారణతోఁ గూడినదో యది ధర్మమని నిశ్చయము. ధర్మము తన్ను ధరించిన పురుషులను నంతకు నధమగతులకుఁ బోకుండ ధరించును. కావున ధర్మరక్షతి రక్షితః" తన్ను రక్షించువారిని ధర్మము రక్షించును. లోకాస్సమస్తా ధర్మేణ, ధార్యంతే సచరాచరః, ధర్మోపిధార్యతే బ్రహ్మ స్తంభ భూతైర్భవాదృశైః. సచరాచరములైన లోకము లన్నియు ధర్మముచే ధరింపఁబడినవి. బ్రాహ్మణుఁడా ధర్మమోస్తంభమువంటివారగు మీచేత ధరింపఁబడు చున్నది. ధర్మమనఁగాఁ బ్రాణిసంరక్షణమునకు హేతుభూతమైన ప్రవృత్తి విశేషము. అనఁగా నితరప్రాణులకు నొప్పికలుగకుండ వర్తించుట ధర్మము, ఏవిధముగనైన నేమాత్రమైన నొప్పికలిగించుట యధర్మము.

**శ్లో. ధర్మఃప్రాణ పరిత్రాణం తద్వైముఖ్యంతు పాతకమ్**
**సర్వాణి ధర్మజాతాని, ఏతచ్ఛేశానివైజగుః**
**ఏకతః క్రతవః సర్వే, సమగ్ర వరదక్షిణాః**
**ఏకతః ప్రాణభీతస్య, ప్రాణినః ప్రాణరక్షణమ్.**

ధర్మమనఁగాఁ బరులప్రాణము రక్షించుట, దానికి విముఖుఁడగుట యధర్మము. సంపూర్ణ దక్షిణలతోడి సర్వయజ్ఞములు ప్రాణభీతుఁడైనవాని ప్రాణమును రక్షించుటతో సరిగావు.

**అర్థస్వరూపము –** వర్ణాశ్రమధర్మ పద్ధతుల ననుసరించి ధనమార్జించి ధర్మబుద్ధితో దేశకాలపాత్రముల నెఱిఁగి భూతహితముగా వ్యయపఱుచుట.

**కామస్వరూపము –** ఇది యానంద సుఖానుభవము గోరుట. ఇది యైహిక సుఖము, ఆముష్మిక సుఖమని రెండువిధములు ఇందు, విషయానందము కన్నులు, చెవులు, ముక్కు, నోరు, దేహము. ఇవి విషయములను శబ్ద, రస, రూప, గంధములను నాకర్షించుటవలనఁ గలుగును. మఱియు దారపుత్ర జననీజనక ధనధాన్య రత్నహారచందన పుష్ప పరిమిళ గంధ పశుగృహా రామాదులవలనఁ గలుగును.

**ఆముష్మికసుఖము –** స్వర్గలోకమునకుఁ బోయి యచట నాఁకలి దప్పులు ముదిమి లోనైన దుఃఖములు లేక సర్వదా ప్రాయపువారై నందనో ద్యానములందు, నాకాశ యానములందు నప్సరసలతోడఁ దామిందార్జిం చిన పుణ్యము క్షయమగువఱకుఁ గ్రీడించుచుండుట.

**ఆత్మానుభవము –** ఐహిక సుఖదుఃఖము లందును స్వర్గాది భోగములందును వైరాగ్యము కలవాఁడై వీనినుండి తప్పించుకొనఁగోరి యాత్మానాత్మవస్తు వివేకము గలవాఁడై యాత్మావలోకన నిష్ఠుఁడై యుండుట, వీఁడు కేవలుఁడైన ముక్తుఁడేకాని వీనికి బ్రహ్మానందానుభవము లేదు. భర్తలేని స్త్రీ యద్దమునందుఁ దన్నుఁ దాను జూచికొని యొంటరిగ మరియు చుండుటవంటిది కైవల్యము.

**భగవత్ప్రాప్తి :–** ఇది పరమ పురుషార్థ లక్షణమైన మోక్షము. ఇది భగవదనుభవ రూపము. భగవంతుఁ డు జ్ఞానానంద స్వరూపుఁడు. జ్ఞానానంద గుణకుఁడు. ఆయనయంశమగు జీవుఁడును జ్ఞానానంద స్వరూపుఁడే. గుణములందు జీవాత్మ పరమాత్మలు సమానులు. అయినను ప్రకృతిబద్ధుఁడై కర్మబంధములకు లోపడినవాఁడు, కావున జీవాత్మ జ్ఞానానందములు సంకోచము నొందును. ముక్తదశయందుఁ బూర్ణముగ వికసించును. ఈ కారణముచేతనే వాస్తవమున నజరుఁడు నమరుఁడయ్యును జీవుఁడు బద్ధదశయందుఁ దాను ముసలివాఁడ నైతినని మరణింతునని దుఃఖించును. ఆనందము స్వభావసిద్ధమైనదగుటచేత నది మఱిమఱి యధికముగ ననుభవింప సర్వదా కోరిక గలవాఁడగుచున్నాఁడు. ఈ కోరిక బలము చేతనే పరిణామక్రమంబున స్థావరదశయం దున్న వాఁడు తిర్యక్కగుట, ఆవల మనుష్యుఁడగుట, ఆవల దేవతయగుట, ముక్తుఁ డగుట. స్థావరములందును, ఆనంద మనుభవించుట, అంత కెక్కువ యానందము కోరుట గలదు. పరిపూర్ణ బ్రహ్మానందము కలుగువఱ కీకోరిక యతనివిడిచిపోదు కాని పురుషుఁడు విపరీత భావనలచేత దానిని సంకోచింపఁ జేయవచ్చును. కేవల జ్ఞానము జ్ఞానమని యల్లాడువారు జ్ఞానానందముల రెంటిని వృద్ధిచేసికొనక యొకజ్ఞానమును మాత్రమే వృద్ధిచేసికొనుటచే వారికి నానందానుభవము కలుగదు. కలిగినను నత్యల్పము. భక్తియనఁగాఁ బ్రేమతోడిసేవ. భక్తుఁడు ప్రేమాస్పదుఁడు కావున వాఁడేదశయందును దశకొలఁది నానందము ననుభవించు చుండును. ప్రేమసేవ యెక్కువగుకొలఁది నానంద మెక్కువగు చుండును. ఆనంద మెక్కువగుకొలఁది ప్రేమ సేవయు నెక్కువగుచుండును. ప్రేమసేవ యెక్కుడగుకొలఁది నానందమెక్కు వగును. ఈ విధముగఁ బరిపూర్ణసేవయుఁ బరిపూర్ణానందము లభించువఱకు నివి యుత్తరోత్తరాభివృద్ధిఁ గాంచుచుండును. ఈ దశ లభించుటే ముక్తి. ఈయానంద మనంతము, అవ్యయము, అనవద్యము. ఇది యిట్టిదని చెప్ప సాధ్యపడదు. వయస్సు పురుషుఁడు చక్కఁగ నధ్యయనము చేసినవాఁడు కడుపారఁదిని జీర్ణించుకొనఁ గలవాఁడు దృఢగాత్రుఁడు బలవంతుఁడు అట్టి వానికి ధనపూర్ణమైన భూమియంతయు లభించిన నెంత యానందమో దీనికి 1000000000000000000 అంతలు చతుర్ముఖబ్రహ్మయొక్క యానందము, పరబ్రహ్మానంద మింతకు నెంతయెక్కువగ నుండునో శ్రుతియుఁ జెప్పలేదు.

ముక్తుఁడగు భక్తుఁడు ప్రపన్నుఁడు కోరినను గోరకున్నను నిట్టి యానంద మనుభవించును. భక్తుఁడు ప్రపన్నుఁ డర్చిరాది మార్గమునఁ బరబ్రహ్మస్థానమునకుఁ బోవును. అది వేఱొకచో వివరింపఁబడును. ఈ ముక్తి మనుష్య జన్మమందే సాధ్యముగాని యంతకుఁ దక్కువకాని యెక్కువగాని దశయందుండువారికి

సాధ్యపడదు. దేవతలయినను మరల భూమియందవతరించియే ముక్తులు కావలయును. కావున మనుష్య జన్మమును వ్యర్థపఱుచుకొను వారికంటె నికృష్టులెవ్వరు.

**ఉపాయస్వరూపము.**

ఉపాయమనఁగా మీఁదఁ జెప్పఁబడిన మోక్షము సాధించు సాధనము. ఇది కర్మము, జ్ఞానము, భక్తి, ప్రపత్తి, ఆచార్యాభిమానమని యైదువిధములు. అందుఁ గర్మము– ఏవర్ణమందేయాశ్రమమం దెవ్వఁ డున్నాఁడో యావర్ణమునకు నాయాశ్రమమునకు విధింపఁబడిన కార్యము లేవియో యవి యథావిధి భగవత్ప్రాప్తిగఁ జేసి ఫలము భగవంతునకు సమర్పించుట కర్మయోగము. యజ్ఞదాన తపోధ్యానములు సంధ్యావందన, పంచమహాయజ్ఞములు అగ్నిహోత్ర పుణ్యక్షేత్ర తీర్థయాత్రలును కృఛ్ర చాంద్రాయణ పుణ్యనదీస్నాన వ్రతచాతుర్మాస్యలును. ఫలమూలాశన శాస్త్రాభ్యాస సమారాధన జప తర్పణాదులు గావించుటచేఁ గలిగిన దేహశోషణముచేఁ బాపము నశించును. దేహశోషణమునఁ బాపమెట్లు నశించునని సందేహింపఁ బనిలేదు.

మనస్సతిచంచలము, విషయానుభవమం దాసక్తము. కావున విషయములపైఁ బోవుట దాని స్వభావము. దాని నేదైన నొకపనియందు నియమింపవలెను. మంచి కార్యములపై మనమై దానిని నియమింప మేని దానంతట నది చెడుకార్యములందు లగ్నమగును. కావున మీఁది కార్యములందే విరామములేక యుంచితిమేని యాకార్యములందే మనస్సు ప్రసక్తమై యుండుటచే వేఱువిషయములకై పరువెత్తదు. ఈ విధముగఁ బాపార్జనమార్గము పాడుపడును. ఈ కార్యములన్నియు భగవత్కైంకర్యబుద్ధితోఁ జేసి ఫలమాయన కు సమర్పించుటచే ఫలానుభవము కర్తకు లేకపోవుటయే కాక భగవత్సన్నిధానమునఁ బూర్వకృతపాపములు నశించును. అప్పుడు మనస్సు నిర్మల మగును. జ్ఞానోదయము నగును. జ్ఞానమునకుఁ గర్మము సాధనము. ఇట్టి జ్ఞానముగలిగి యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణా ధ్యాన సమాధులను నష్టాంగములుగల యోగముచే మనస్సు నరికట్టిన నాత్మావలోకన మగును జ్ఞానోదయముగాకయు నాత్మావలోకన మగుట గలదు. ఈ యోగమువలన నైశర్వార్యాదులు గలుగును.

**జ్ఞానయోగము :–** భగవంతుఁడు హృదయ కమలమందును సూర్యునియందును వేంచేసియున్న వాఁడు, యోగము వలనఁ గలిగిన జ్ఞానమునకు అట్టి భగవంతుని లక్ష్యముచేసి శంకచక్ర గదాధరుఁడు పీతాంబరుఁడును గిరీటము మొదలు కాలి యందెలువఱకుఁగల దివ్యభూషణములు ధరించినవాఁడును లక్ష్మీసహితుఁడుననగు నాభగవంతుని ననుభవించుచుఁ దొలుతఁ గొంచెము కాలముతోఁ బ్రారంభించి క్రమక్రమముగ ధ్యానకాలము హెచ్చించి కడపట విరామములేక సర్వకాల సర్వావస్థలయం దాధ్యానమందే యుండుట జ్ఞానయోగము. ఇది భక్తికి సహకారి, ఇది కైవల్యప్రాప్తికి సాధనము.

**భక్తియోగము :–** మీఁదఁ జెప్పిన జ్ఞానయోగ సాధనము ప్రేమతోఁ జేయఁబడునేని యది భక్తియోగ మగును. ఈ భక్తియోగమందు భావన తైలధారవలె సర్వదా యవిచ్ఛిన్నముగ నుండవలెను. తెఱపి, తెంపు కారాదు. ఈ భక్తి క్రమక్రమముగ వృద్ధియై తీవ్రమగును. ఇంతవఱకు బలాత్కారముగఁ జేయుకార్య మదియే తన్నుఁ జేయుమని సాధకుని బలవంతపెట్టును. అంతవఱకుఁ జప్పిడిగా నుండునది తేనెవలె మధురమై యింకను నింకను ననుభవింతమని యాశకలిగించు చుండును. తాను బలాత్కారముగ నీడ్చుచుండిన మనస్సుతన్నే బలాత్కారముగ నీడ్చును. స్వార్థమంతయుఁ ద్యాగమునఁ బర్యవసించును, ప్రయత్నపూర్వకముగ నుండినది యప్రయత్నయుగ జరగును, హృదయము బుద్ధి యేకమైపోవును. దీనినే భగవద్గీత 12వ అధ్యాయమందు,

**మయ్యేవ మన ఆధత్స్వ మయి బుద్ధిం నివేశ య**
**నివసిష్యసి మయ్యేవ, అత ఊర్ధ్వం నసంశయః**

అని భగవంతుఁడు చెప్పెను. కేవల శుష్క జ్ఞానము ప్రేమరసావిష్ట మయినచో భక్తియగును. కేవల శుష్క జ్ఞానమందుఁ బ్రేమలేదు. ఆ కారణమున నానందములేదు. క్రొత్త వానిని జూచుటవంటిది జ్ఞానము. స్త్రీ ప్రేమాస్పదుఁడైన ప్రియుని, బురుషుఁడు ప్రేమాస్పదురాలైన ప్రియురాలిని జూచుటవంటిది భక్తియోగము.

**ప్రపత్తి :–** బుద్ధిపూర్వకముగ సంతోషముతోఁ దన్నుఁ దనది యనుకొనువానిని సర్వము స్వామి కైంకర్యమునకై సమర్పించి యట్టి కైంకర్యమువలనఁ గలుగు ఫలముకూడ నాయనకే సమర్పించి రక్షాభార మాయనయం దేయుంచి దాసభూతుఁడై భగవంతుఁడే రక్షకుఁడను దృఢవిశ్వాసము కలవాఁడై యుండుట,

ఇట్టివాఁడు ప్రపన్నుఁ డనఁబడును. కర్మ జ్ఞాన భక్తుల సాధించువారు స్వప్రయత్నముతో సాధింతురు. తన రక్షణ విషయమై ప్రపన్నుఁడు స్వప్రయత్న మేమియుఁ జేయఁడు. భారము భగవంతునందువైచి నిర్భరుఁడై నిర్భయుఁడై తల్లిదండ్రులయందు భారముంచి తిరుగు బాలునివలె నుండును. ఇది యది యనక తన సర్వస్వము భగవంతునకై త్యాగము చేసినవాఁ డగుటచేఁ బ్రపన్నుఁడే సత్యమైన సన్న్యాసి. ఇదియే యన్ని తపస్సులలో శ్రేష్ఠమైనదని యుపనిషత్తు చెప్పుచున్నది. కర్మజ్ఞానయోగములు సాధింప నధికారముండవలెను. అందఱు వాని కర్హులుగారు. అవి యనవరత ప్రయాససాధ్యములు భగవంతునకుఁ దనకుఁగల సంబంధము దెలిసినవానికవి యనావశ్యకములు, అవి లేకున్న లోపములేదు. భగవంతుఁడు రక్షకుఁడు నేను రక్ష్యుఁడను. భగవంతుఁడు స్వామి నేను దాసుఁడను ఆయన సొమ్మును, ఆయనతండ్రి నేనుబిడ్డను, ఆయన భర్త నేను భర్తవ్యుఁడను, ఆయన సర్వజ్ఞుఁడు, నేనజ్ఞుఁడను నా కేదిమేలో ఆయనకుఁ దెలియును గాని నాకేమి తెలియును. ఆయన శరీరి, నేనాయన శరీరరము. ఆయన వ్యాపకుఁడు నేను వ్యాప్యుఁడను. ఆయన భోక్త, నేను భోగ్యము. ఆయన ధారకుఁడు, నేను ధార్యుఁడను. ఆయన సర్వశక్తి, నేను గేవల శక్తిహీనుఁడను. ఆయన సర్వసంపూర్ణుఁడు, నేనపూర్ణుఁడను. ఆయన యవాప్త సమస్తకాముఁడు, నేను గామదాసుఁడను. అని యిట్టిసంబంధము జ్ఞానముగలవానికిఁ గర్మజ్ఞాన భక్తియోగములతోఁ బనిలేదు. అనఁగా నవి మోక్ష సాధనములుగా గ్రహింపక భగవదాజ్ఞయని కైంకర్యములుగాఁ జేయవలెను. వానిని జేయుటయం దేదైన లోపము గలిగినను భయములేదు. ఆమూఁడు యోగములవలె నిరంతరము చేయు పని లేదు. ఒక్క సారి లక్ష్మీనారాయణుల నుద్దేశించి వారి యెదుట,

**"త్వం మాతా సర్వలోకానాం, సర్వ లోకేశ్వర ప్రియే ।**
**ఆశ్రయేశ్వర మిమ, మపరాధ శతైర్యుతమ్ ॥**
**నారాయణ దయాసింధో, వాత్సల్యగుణసాగర । త్రాహ్యే**
**నం పాపినం దేవ కృపయా సముపాగత"** మ్మని నిండు మనస్సుతో శాస్త్రవిధి ననుసరించి చెప్పినఁ జాలును.

ఆ మూఁడు యోగములకు మరణకాలమందు భగవన్నామస్మరణ యావశ్యకము. ఏకాలమందైన నది యేకారణముననైన రాదేని మరల జన్మము తప్పదు. దీని కది యనావశ్యకము. జీవిత కాలమందుఁ జేయుచుండినఁజాలును. దీని కీవర్ణము వారే యీ యాశ్రమమువారే యోగ్యులను నియమములు లేవు. దీనికి నాలుగు వర్ణాశ్రమములవారేగాక చండాలాదులు యోగ్యులే. యవనవ్యాధ పుళిందహూణ శకకంకాభీర చండాల సంభవులుం దక్కిన పాపవర్తనులు నేభద్రాత్ము సేవించి భాగవత శ్రేష్ఠుల దాసిశుద్ధతనులై కల్యాణులై యుందురు" అని భాగవతము.

ఇది చేయుటకుఁ గాలనియమము దేశనియమము లేదు. భగవత్కటాక్షమునకుఁ బాత్రుఁడుగావలయు ననుకోరిక గలిగినఁ జాలును. తగినగురుఁడు దొరకినసమయమే యుక్తకాలము. అదియే యుక్తదేశము. ఇందు భగవత్తిరస్కారభయము లేదు. నేను నీవాఁడను అనినంతమాత్రమున నాయన స్వీకరించును. సర్వక్రి యలు సర్వపదార్థములు ఇల్లు, వాకిలి, పెండ్లాము, బిడ్డలు, గొడ్డు, గోదలు సర్వము స్వామివే. తాను దాసుఁడనను జ్ఞానము కుదిరి యాభావముతోనే చేయుటచే స్వార్థమననునది యందులేదు. ఆ కారణమునఁ గర్మబంధము లేదు. కావున వీనికి మఱుజన్మములేదు. వీఁడు భగవదగ్నియందుఁ దన్నే యాహుతిగాఁ జేసి కొనుచున్నాఁడు రక్షాభారము తప్పుటచే వీఁడు సర్వస్వతంత్రుఁడు. భగవంతునకుమాత్రమే పరతంత్రుఁడు.

భక్తుఁడు భగవత్కైంకర్యముల నాయావేళలు క్రమము దప్పనీయక చేయుచుండవలెను. ప్రపన్నున కీ నిర్బంధము లేదు. తాను జేసినది యాయనకు సమర్పించును భగవంతుఁడే ప్రేరకుఁడై తనకార్యములు చేయించుకొనువాఁ డగుటచే నందలి లోపాలోపములకుఁ దానుత్తరవాదిగాఁడు. కర్తృత్వాభిమానములేదు.

ఇందకించనుఁ డనుత్తముఁ డగుచున్నాఁడు.

ఈ ప్రపత్తి రెండువిధములు దృప్తప్రపత్తి, ఆర్తప్రపత్తి యని – కాఱుచిచ్చునందుఁ దగులుకొనినవాఁడు దానియందొక్కక్షణమైన నిలువలేక యెట్లు తప్పించుకొనఁగోరునో సంసారదవాగ్ని యందు నట్టితాపము గలిగి సద్యోముక్తి గోరువాఁడు ఆర్తుఁడు. వీనికి దేహధారణము దుష్కరమైతోఁచును దృప్తప్రపన్నుఁడు ప్రారబ్ధానుభవము సహించి స్వవర్ణాశ్రమ ధర్మములచొప్పున భగవత్సేవ చేయుచు నాకార్యము నేను జేసెదను ఆయన కార్యము రక్షణ మాయనచేయనీ చేయకపోనీ నాకేమి యని జీవితకాలము గడుపుచుండును. ఆర్తునకున్న యావేగము వీనికిలేదు. వానికి వీనికిఁ గాలవిలంబనము భేదము ఫలభేదములేదు. ఆర్తునకంటె

దృష్టునకు భగవదనుభవము విపులము. ప్రపత్తినే శరణాగతియని భరన్యాసమని న్యాసమని సన్న్యాసమని యందురు. ప్రపన్నామృతమునందు నిది విశదీకరింపఁ బడినది.

ఆచార్యాభిమానము. ఇది రెండువిధములు, ఆచార్యుఁడు తానే స్వయముగఁ బురుషకారభూతుఁడై తరణోపాయము దెలియనివానిని దరింపఁజేయుట. రెండవది శిష్యుఁడుగానుండి తను నాశ్రయించినవానిని దరింపఁజేయుట, ఆచార్యుఁడు భగవంతునకు నాశ్రితునకు నడిమివాఁడు. శ్రీరామవార్త సీతాదేవికిని సీతా దేవి వార్త శ్రీరామునకును హనుమంతుఁడు దెలిపినట్లు భగవంతునకు నాశ్రితునకు నడుమ మధ్యవర్తియై యుండి శిష్యునికి భగవత్ప్రాప్తి కలిగించువాఁడు.

శాస్త్రవిధముదెలిసి శాస్త్రచోదిత కర్మానుష్ఠానము గలవాఁడై శిష్యుని నాచారమందు నిలుపువాఁ డాచార్యుఁడు తానుజెప్పిన యనుష్ఠానము సలుప శక్తిలేనివాని విషయమునఁ జంటిబిడ్డవ్యాధి నివర్తింపఁ జేయఁ దల్లి పథ్యముండునట్లు శిష్యునకుమాఱు తానే భగవంతునికి శరణాగతిచేసి స్వామీ వీఁడు దేనికి సమర్థుఁడుగాఁడు నీవు కేవలకృపచే వీనిని రక్షింపుమని ప్రార్థించును. భగవంతునికంటె నీయన యాశ్రితునకు సమీపమువాఁడు. సుఖదుఃఖములు చెప్పిన విని ప్రతీకారము చేయువాఁడు తనకు దృగ్గోచరుఁడు భగవంతు నాశ్రయించిన దీర్ఘకాలమునకుఁగాని కార్యము సఫలముగాదు. ఆచార్యుఁ డను గ్రహించిన శీఘ్రకాలమందే కార్యము ఫలించును. భగవంతునకంటె నాచార్యుఁడు సులభుఁడు కావున భగవంతు నాశ్రయింప శక్తిలేనివా రాచార్యు నాశ్రయించుట శ్రేయస్కరము. ఈ యాచార్యుఁడు యోగ్యతగలవాఁడై, సంసారము తానై తరింపఁ జాలినవాఁడై భగవదనుగ్రహమునకుఁ బాత్రుఁడైనవాఁడుగా నుండవలెను. లేనియెడల నాశ్రితుఁడు చెడును. తానైలేచి రాలేక నేలఁబడి యేడ్చుబిడ్డను దానెత్తుకొని దుమ్ముదుడిచి తనభర్తయొద్దనిచ్చు తల్లివంటి వాఁడాచార్యుఁడు. ఆచార్యుఁడు భగవదాజ్ఞలేక తానే స్వతంత్రించి మధ్యవర్తిగా నుండరాదు. ఆయన యాజ్ఞవరకు నాశ్రితులకు భగవత్రాప్తి యుపాయము చెప్పుచుఁ దన కార్యము మానుకొనియైన వారిని రక్షింప యత్నింపవలెను. ఇట్లు కేవలకృపచే జీవుల నుద్ధరింప శ్రమించు నాచార్యు విషయమున భగవంతుఁ డను గ్రహించును. కావున నాచార్యాశ్రయణము జీవులకుఁ గర్తవ్యమగుచున్నది.

ఆచార్యసేవయే సర్వదా చేయుచు నాయనయే తరణోపాయమని యెంచి యాయనను గాచియుండు వాని కిది స్వతంత్రోపాయ మగును. తక్కినవారి కిది సహకారి యగు నుపాయము. భగవంతుని సద్వారకముగ నద్వారకముగ సేవించునట్లే యిదియు. భగవత్థా ్సనమున నాచార్యుఁడు. అద్వారకమనఁగా భగవంతు శ్రీమన్నారాయణుఁ బ్రత్యక్షముగ సేవించుట, సద్వారకమనఁగా సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" యన్నట్లు రుద్రేంద్రాదులం దంతర్యామిచా నున్నాఁడని యెఱిఁగి వారిని భగవదాత్మకులుగా సేవించుట.

**(సశేషము.)**

**శ్రీరామాయనమః**

## బమ్మెరపోతనకోరిక నేఁటికిఁ బూర్తియైనది.

**మందరము.**

అత్యంత శ్రీరామ భక్తుఁడైన పోతనా మాత్యుఁడు "చెనకి చెఱిచినాఁడు భాస్కరుఁడు. లేకుండిన రామాయణమును బండికెక్కింపనా" యనె నని యొక లోకోక్తి కలదు. ఆయన సంకల్పము నేఁటికి సఫలమైనది.

ఆయనకుఁ బ్రాణపదమైన శ్రీరామాయణము మాహాత్మ్య మంతయుఁ దెలుప నిదిసమయముగాదు గాని యా విషయమున రెండుమూఁడు శ్లోకము లనువదించెదను.

**"వేద వేద్యే పరేపుంసి, జాతే దశర థాత్మజే**
**వేదః ప్రాచేతసా దాసీత్, సాక్షాద్రామాయణాత్మనా"**

ఆమ్నాయవేద్యోహరి యన్నట్లు వేదములచేతఁ దెలిసి కొనఁబడు నా పరమ పురుషుఁడు దశరథ కుమారుఁడై జనించినపుడు ఆయన మాహాత్మ్యము వెల్లడించి లోకులఁ గృతార్థులఁజేయ సాక్షాద్వేదమే వాల్మీకి మహర్షి కృత రామాయణమయ్యెను. ఇట్టి శ్రీమద్రామాయణ మునకు శ్రీమన్నారాయణుని యపరావతారమైన వ్యాసమహర్షి వ్యాఖ్యన రూపముగ ధర్మశాస్త్రమును బోధించు శ్రీ మహాభారతమును వేదాంతార్థమును బోధించు శ్రీ భాగవతమును వ్రాయుచు మహాభారతమందు.

**"వేదేరామాయణే చైవ, పురాణే భారతే తథా**
**ఆ దావంతే చమధ్యేచ, విష్ణుస్సర్వత్ర గీయతే** యని వ్రాసెను.

వేదమందు రామాయణమందు పురాణమందు భారతమందు మొదట నడుమఁ దుద నెందుఁ జూచినను విష్ణువు కీర్తింపఁబడుచున్నాఁడు. బెల్లపు గడ్డయం దేభాగము దీసి నోరవేసికొనినను మధురరసము తెలియనగును. అట్టులే రామాయణమందు విష్ణువే సర్వత్ర కీర్తింపఁబడినను ఒక్కొక్క కాండ మందు నొక్కొక్క ఘట్టమునందు నొక్కొక్క సమయమున నన్నిరసములు తెలియనగును. కావున వెగటు పుట్టింపదు. మనోరంజన పుష్పమువలె నొక్కొక్కసారి యొక్కొక్క క్రొత్త విశేషము స్ఫురింపఁజేయును. ఇంతమాత్రమేకాదు. సమస్తాధి వ్యాధి బాధలకు రామాయణము దివ్య రసాయనమని యీ శ్లోకముచేఁ దెలియనగు.

**అశేష మేకేనైవాహ్న శ్రు త్వారామాయణం తన**
**శాపస్య శాంతిర్భవతీత్యూచి రేతే ప్రసాదితాః ॥**

తమ కాతిథ్యమీయని దామోదరుఁడను రాజును ఋషులు శపించిరి. ఆయన ప్రార్థింపఁగా రామాయణ మంతయు నొక నెట్టున వినుటచే శాపముక్తుఁడ వయ్యెదవని యనుగ్రహింప నాప్రకారమేచేసి కుష్ఠరోగముక్తుఁ డయ్యెను. అమోఘమైన ఋషుల శాపమును హరింపఁగలది మఱిదేనిని హరింపఁ జాలకుండును?

సూర్యాది దశానాథులును అంతర్దశానాథులను దుష్టములై బాధించునపుడు వానివాని శాంతికై విధింపఁబడిన యాయా సర్గములను ఆయా శ్లోకములను బఠించిన నాదోషము నివారణ మగును. దుష్టశక్తి ప్రయోగములను జెఱుచుటకై కొన్ని శ్లోకములు విధింపఁబడెను. సకాము లెట్లు ఎప్పు డేయేకామమునకు నేయేభాగము పఠింప వలయును ముముక్షువు లెప్పు డెట్లు పఠంపవలయును అను నియమములు గలవు. ఇవిగాక మహామంత్రములును గలవు వీని లక్షణమెఱుఁగక గ్రుడ్డియెద్దు చేలోఁబడినట్లు పారాయణము చేసిన నేమి మేలు?

ఇవిగాక కావ్యార్థ విశేషములు ధ్వన్యర్థములు విశేషార్థములు శాస్త్రవిచారములు పెక్కులుగలవు. ఇట్టియద్భుత మహిమగలిగి సర్వవిషయముల నన్నివిధములఁ బ్రథమంబని పేరెన్నికగన్న యీ యుత్తమోత్తమ లోకోత్తర గ్రంథము సంస్కృతమున నుండిన కారణమున నాభాష రానివారి కది యందనిపండై యుండెను. ఆకారణమున దానిమహిమయుఁ బూర్ణముగ నాంధ్రలోక మెఱుఁగదు. దానియందలి మీఁదఁజెప్పఁబడిన విశేషగుణము లేవియు లోపింపక మూలమునకు సరిగా నున్నదని పండితులచే విఖ్యాతిగన్న **ఆంధ్రవాల్మీకి రామాయణమును** బ్ర ॥ శ్రీ ॥ రా ॥ శ్రీ ॥ వావిలికొలను సుబ్బరావుగారు రచించి యాకొఱంత దీర్చిరి. కాని యెందెం దేయేని శేషములున్నవో తెలసికొను మార్గము మాత్ర మాంధ్రుల కింతవఱకుఁ దెలియకుండెను. కావున వారే యాకొఱంతయుఁ దీర్పఁగోరి **మందర** మనుపేర నిపుల వ్యాఖ్యానము రచించి యాయా యర్థముల నెల్ల వెల్లడించిరి.

ఒక్కగంతున సముద్రమును లంఘించిన క్రోఁతుల కాసముద్రములోనుండు నమూల్య పదార్థముల నెట్లెఱుఁగ శక్యమగును? మందరముగదా దానిని మథించి శోధించియందు మునిఁగి వెలికివచ్చి దానియందలి చింతామణి కామధేను కల్పవృక్ష లక్ష్మీసుధా ఘటంబులను వెలుపలఁదీసి సాధుబృందారక బృందమునకు లభింపఁజేసి వారి నమృతులఁ జేసెను. అట్టులే యీ మందరము ఆంధ్రవాల్మీకి రామాయణ మహార్ణవము మథించి దానియందలి యమూల్యార్థము లన్నియు మీఁదఁజెప్పిన విశేషములతోడఁ దేట తెల్లముగ దానిని సేవించిన సర్వజనులకుఁ దెలియునట్లు విశదపఱిచెను. ఇట్టి రామాయణ గ్రంథ మేదేశమున నేభాషయందను లేదని ప్రసిద్ధికెక్కినది. ఈవ్యాఖ్యానము నట్టి ప్రసిద్ధియే కాంచఁగలదు.

ఈ మందరమందు మూలపద్యము ప్రతి పదార్థము తాత్పర్యము, విశేషార్థము, ధ్వన్యర్థము, శాస్త్ర చర్చలు ఛందో వ్యాకరణాలంకార విశేషములు, మంత్రార్థము, భక్తులకుఁ బ్రపన్నులకుఁ గావలసిన సర్వ విషయములు విశదముగా విపులముగా వ్రాయఁబడెను. రామాయణవిషయమునఁ గొందఱకుఁగల సందేహములకుఁ బరిహారములు వ్రాయఁబడినవి రామాయణకాలమునాఁటి మనదేశవిభాగము (Geography) వ్రాయఁ బడినది. సీతారామ లక్ష్మణుల సంచారమార్గములు తెలుపు పటములు శ్రీరాముని దినచర్యయు నిందుఁగలవు.

రామాయణమందలి ముఖ్యస్త్రీపురుష గుణవర్ణనములు నిందుఁగలవు సంస్కృత వ్యాఖ్యానములకంటె నిందనేక విషయములు నేఁటివారెఱుంగఁదగినవి వ్రాయఁబడినవి. శైలిసర్వ జనీనము. గ్రంథకర్తయె వ్యాఖ్యాతయు నగుటచే పెట్టినవానికిఁ దెలియు నిక్షేపమన్నట్టు లన్ని విషయములు యథార్థరీతి వెలికి

రాఁగలిగెను. అమృతాన్నము సిద్ధమైనది అదృష్టవంతులు భుజింతురు. ఇంత లోకోపకారమై యింత హితబోధకమై యింత యిహపరసాధకమై యింత సర్వజన సేవ్యమై సర్వజనీనమైన యింత గొప్పగ్రంథ మిదితప్ప నింతవఱకు నాంధ్రంబున వేఱొండులేదని గ్రంథమున బఠించినవారు చెప్పుచున్నారు. ఇంతగొప్ప గ్రంథ మొక్కసారిగ ముద్రింప నసాధ్యము కావున భాగములుగ ముద్రింపఁబడు చున్నవి. ఎంతటిపండితుఁ డైనను దీనిని జదువనివాఁడు రామాయణార్థము పూర్ణముగఁ జెప్పఁజాలఁడని యనేకుల యభిప్రాయము.

ఇప్పటికి ముద్రింపఁబడిన భాగములు-

| | | |
|---|---|---|
| ప్రథమభాగము ప్రథమసంచిక | | 1-8-0. |
| ,, | రెండవసంచిక | 1-4-0. |
| ,, | మూఁడవసంచిక | 1-4-0. |
| ఈ మూఁడుసంచికలు కలిగిన భాగము | | 3-8-0. |
| 2-3-4-5-6 భాగములు ఒక్కొక్కటి | | 1-0-0. |

(1) శ్రీరామజయమందిరము, తిరువళిక్కేణి మదరాసు.
(2) వాల్మీకాశ్రమము సత్తెనపల్లి, గుంటూరు మండలము.
(3) రామా అండుకో, ఏలూరు, బెజవాడ.
వీరికి వ్రాయవలెను.

### మనవి.

ధనాభావముచేఁ దక్కిన భాగములు ముద్రింప సాధ్యము కాకున్నది. ధర్మము చేసినవానికంటె దానిని బాలించిన వారికిని, వంటచేసి యుంచుకొన్న వానికంటె దానిని బదుగురకు వినియోగపడ వడ్డించు వారికి నెక్కువ ఫలముగలదు. అట్టులే ధర్మాత్ము లొక్కొక్క భాగము ముద్రింప సహాయపడి తమపేరు శాశ్వతపఱుచుకొనఁ గోరఁబడుచాన్నారు.

తక్కినవారు వారివారి శక్తికొలఁది స్వహస్త పరహస్తముల విరాళము లొసఁగియు ముద్రిత భాగముల వెలకుఁ దీసి కొనియు లోకుల కీ గ్రంథవిషయము తెలియఁ బఱిచియుఁ దక్కిన భాగములు ముద్రింప సాహ్యపడఁ బ్రార్థింపఁబడుచున్నారు.

**మందర కార్యనిర్వాహకులు.**

### మందరము.

మందర మాఱుభాగములు తీసికొన్నవా రేడవభాగమెప్పుడు వెలువడునని వ్రాయుచాన్నారు ధనాభావముచే నాభాగ మింకను ముద్రింపఁబడలేదు. భగవ దనుగ్రహముకొలఁది జరగును.

**యా. సుబ్బదాసుఁడు.**

### వాసుదాస జయంతి.

ఆంధ్రవాల్మీకి వాసుదాసుగారి జయంతి మాఖశు 4 లు 19-1-34 తేది యగును. చిత్రమేమో యీసారి యొక సంవత్సరము పేరు తప్పఁ దక్కిన తిథి వార నక్షత్రాదు లన్నియు జన్మదివసమందువలెనే సరిపోవుచున్నవి.

**యా. సు.**

### విజయ యాత్ర.

వర్ణాశ్రమ ధర్మములు వఱదపాలుచేసి సనాతన ధర్మముల సమయఁ జూచి దేవాలయముల శవాలయ ములుగా మార్చి సతులను వారసతులఁజేసి పరస్పర కలహములు పెంచి సంపూర్ణకలి నేఁడేవచ్చునట్లు చేయఁ బ్రబల ప్రయత్నములు జరగుచుండుట లోకు లెఱింగినవిషయమే. ఈ ప్రయత్నము జరగుచుండుట లోకు లెఱింగినవిషయమే. ఈ ప్రయత్నము కొనసాగనీయరాదని లోకులకు మతధర్మములు భక్తి యుద్భవింపఁ జేయవలయునని మహాత్ములు కొందఱు సనాతన ధర్మనిష్ఠులు కంకణము కట్టుకొని పనిచేయుచున్నారు. ఆ విషయమునఁ గృషిచేయు (ఇండియన్ మిర్రర్) అను పత్రికయందీ విషయ మిట్లు వ్రాయఁబడినది.

శ్రీ పార్థసారథి భగవానుల విగ్రహము పంచలోహములఁ జేయించి సంప్రోక్షణ ప్రాణప్రతిష్ఠాది కార్యములు నెఱవేర్చి రథమునందు వేంచేపుచేసి బ్రాహ్మణులు దాని నీడ్చుచు భజన సంఘములతోడ హిందూ దేశము నంతయుఁ బ్రదక్షిణముగాఁ దిరిగి యందందు భక్తివిషయముల నుపన్యసించుచు భజనలు చేయుచు వచ్చెదరు. ఈ తేరియందు గురవాయూరు దేవాలయమందలి శ్రీకృష్ణమూర్తి పాదుకలుంతురు.

ఈ రధమువెంట జగన్నాథమందలి గోవర్ధన పీఠ స్వాములవారగు శ్రీశ్రీ శంకరాచార్యులవారు భక్తిమత విషయమై యుపన్యాసము లిచ్చుచువత్తురు. శ్రీశ్రీ కురుకుంది పీఠ స్వాములవారు భజనలు చేయుచుందురు.

ఈ యాత్ర 1934 సం॥ జనవరి మొదటి వారములో గురవాయూరు బయలుదేఱి కళ్ళికోట తెలిచేరి మంగళూరు దక్షిణ కన్నడము ఉత్తరకన్నడముల సంచరించి బొంబాయి మీఁదుగా ప్రయాగచేరి అచ్చటనుండి యుత్తరహిందూ స్థానమున సంచరించి హిమాలయమువఱకుఁ బోయి యచ్చటనుండి బంగాళా దేశము చేరి యచ్చటనుండి కటకము కటకముమీఁదుగా నాంధ్రదేశమునుండి చెన్నపురిచేరి యచ్చటనుండి కన్యాకుమారికిఁబోయి మరల గురవాయూరు చేరును.

భగవంతుఁడు వీరియాత్ర ఫలవంతము చేయుఁగాక! ఈ ప్రకార మాంధ్రదేశమునఁ గొంతభాగమైన సాధ్యమైనంతదనుక భక్తిప్రబోధమునకై కాలినడ సంచరింప వలయునని వాసుదాసుఁ డీ సంవత్సరమునఁ దలఁచి కొంత యత్నము చేసెను గాని మందర కార్య మనివార్యమగుటచే నది సమకూరి నదిగాదు. ఇప్పుడైనను 5-6 గురు భజన చేయఁగలవారు వెంబడింపఁ దలఁపుగలవారు లభింతురేని చైత్ర మధ్యము నుండి బయలు దేఱు తలఁపు గలదు.

వీరు చక్కని నడవడి, నిక్కపుభక్తి గలవారై అహారాదులకుఁ బరులఁ బీడింపనివారై వలసిన చోట నడవఁగలవారై కష్టముల కోర్చువారై స్వయందాసులై వారి వ్యయములు వారు భరించువారై యుండవలెను.

ఇట్టికోరికగలవారు యామర్తి సుబ్బదాసుఁడు లక్ష్మీనరసాపురము, పిఠాపురమని వ్రాయవలెను. ఈ భక్తి క్షేత్రయాత్రకు నుద్దేశము భక్తిప్రబోధమే. ఆ విషయమైన యుపన్యాసము లందం దీయఁబడును.

**శ్రీరామ**

**చందాదారులకు విజ్ఞప్తి.**

సంవత్సర మధ్యమునఁ జందాదారులుగాఁ జేరువారప్పటికిఁ దమకుఁ జేరవలసియుండు సంచికలకు అదనముగా సంచిక ఒకటికి 0-0-6 వంతున నగు మొత్తమును పోస్టేజికిఁ గాను పంపఁ బ్రార్థితులు. అట్లు పంపనివారలకు సంచికలు బంపఁబడవు.

**యా. వెం. సుబ్బదాసుఁడు.**